## అందోల్ రిటర్నింగ్ కార్యాలయం సందర్శన

అందోల్, నవంబర్ 7: నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ శరత్ సూచించారు. సోమవారం అందోల్‌లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్లు సమర్పించేందుకు వచ్చే అభ్యర్థులకు కావాల్సిన అన్ని వసతులు సమకూర్చుకోవాలన్నారు. ఈసీ మార్గ దర్శకాలకు అనుగుణంగా నియమ నిబంధనలు అమలు చేయాలని సూచించారు. అభ్యర్థులు సమర్పించే నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులను సరిచూసుకోవాలన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వసతులు పరిశీలించి తగు సూచనలు చేశారు. అవసరమైతే హెల్ప్‌డెస్కు సహకారం తీసుకోవాలని అభ్యర్థులకు అవసరమైన దరఖాస్తు ఫారాలను సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో అందోల్ రిటర్నింగ్ అధికారి పాండు, ఇతర సిబ్బంది ఉన్నారు.



అందోల్ : అందోల్ రిటర్నింగ్ కార్యాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్, రిటర్నింగ్ అధికారి

## లోటుపాట్లు లేకుండా నామినేషన్ల ప్రక్రియ

నారాయణఖేడ్, నవంబర్ 7: ఎటువంటి లోటుపాట్లు లేకుండా నామినేషన్ల ప్రక్రియను సజావుగా కొనసాగే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శరత్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ నారాయణఖేడ్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నిగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించి నామినేషన్ల ప్రక్రియను పర్యవేక్షించిన సందర్భంగా మాట్లాడారు. నామినేషన్లను సమర్పించేందుకు వచ్చే అభ్యర్థులకు అసౌకర్యం కల్గకుండా హెల్ప్‌డెస్క్‌ను వినియోగించాలని స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వెంకటేశ్‌కు సూచించారు. అవసరమైన దరఖాస్తు ఫారాలను సిద్ధంగా ఉంచాలని, అభ్యర్థులు సమర్పించే నామినేషన్ పత్రాల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా క్షుణ్ణంగా పరిశీలించాలని, చెక్‌లిస్ట్ ఆధారంగా సరిచూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా హెల్ప్‌డెస్క్‌తో పాటు ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశ్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఉన్నారు.



హెల్ప్‌డెస్క్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శరత్

## రేవంతరెడ్డి దిష్టిబొమ్మ దహనం

నారాయణఖేడ్, నవంబర్ 7: పీసీసీ ఉపాధ్యక్షుడు పట్లోళ్ల సంజీవ్‌రెడ్డికి కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో మంగళవారం ఆయన వర్గీయులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. యూత్ కాంగ్రెస్ నాయకులు లోకేశ్‌రెడ్డి, దిలిప్‌రెడ్డిల ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్దకు చేరుకుని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినదాలు చేస్తూ రాజీవ్‌చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి, రాజీవ్ చౌక్ వద్ద రాస్తారోకో చేపట్టారు. సర్వేల ఆధారంగా సంజీవ్‌రెడ్డికి టికెట్ ఇవ్వకుండా కాంగ్రెస్ అధిష్టానం అన్యాయం చేసిందన్నారు. ఇప్పటికైనా పార్టీ అధినాయకత్వం పునరాలోచించి సంజీవ్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని లేని పక్షంలో కాంగ్రెస్‌కు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామన్నారు.


టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు


హత్నూర : ఎమ్మెల్యే అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డిని కలిసి మద్దతు ప్రకటించిన మైనార్టీ నాయకులు


రాయికోడ్ : ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నాయకుడిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న బస్వరాజుపాటిల్


మనూరు : బీఆర్ఎస్‌లో చేరుతున్న బీజేపీ సీనియర్ కార్యకర్తలు

# ఊరూరా నీరాజనం

- బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి
- అన్నపూర్ణ పథకం ద్వారా అందరికీ సన్నబియ్యం
- సిర్గాపూర్ మండలంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ప్రచారం

సిర్గాపూర్, నవంబర్ 7: తెలంగాణలో సమగ్రాభివృద్ధి, సుపరిపాలన బీఆర్ఎస్‌తోనే సాధ్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్, వంగ్దాల్, ఆయా గ్రామాల గిరిజన తండాల్లో ఆయన పర్యటించారు. ఈ మేరకు ఊరూర ఎమ్మెల్యేకు కార్యకర్తలు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. త్వరలోనే అన్నపూర్ణ పథకం ద్వారా తెలంగాణ సర్కారు అందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్నారు. గతంలో 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించలేదో ప్రజలు ఒక్కసారి ఆలోచించాల్సిన అవసరముందన్నారు. ఆచరణకు సాధ్యం కాని హామీల పేరుతో ఓట్లు దండుకోవాలని చూస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాఘవరెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ప్రయాగబాయిమాధవరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు శోభావతిశేరికార్, పార్టీ మండల అధ్యక్షుడు సంజీవరావుపాటిల్, జాగృతి యువవిభాగం జిల్లా అధ్యక్షుడు అరుణ్‌రాజ్, మండల కో-ఆప్షన్ సభ్యుడు బషీర్, ఎంపీటీసీ శివరాం, మొగులప్ప, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, అడ్వకేట్ బస్వరాజ్, వార్డు సభ్యులు ప్రగాబాయి, పద్మినీబాయి, సంజు, పింకమ్మ, రాజు, మల్లన్న, తులసిరాం, పవన్‌పాటీల్, యాదవరావు, రవీందర్ పాటిల్ పాల్గొన్నారు.




సిర్గాపూర్ : ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

# దామరచెరువులో కాంగ్రెస్ ఖాళీ

- మా ఓట్లు అన్న బీఆర్ఎస్‌కే వేస్తాం
- గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం
- ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో భారీగా చేరికలు

నిజాంపేట, నవంబర్ 7: మండలంలోని దామరచెరువు గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు సుమారు 200మంది నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. అనంతరం గ్రామస్తులంతా కలిసి మా ఓట్లు అన్ని మీకే వేస్తామంటూ ఏకగ్రీవ తీర్మానం చేసి ఎమ్మెల్యేతో చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీ చేరినట్లు అశోక్, నర్సింహులు, మంగలి అశోక్, అంజయ్య, విఠల్, సంగమేశ్, లంబడి విఠల్, శివరాం, మన్నె సాయిలు, బాల్‌రాజ్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, సర్పంచ్ మన్నె మల్లేశం, ఉప సర్పంచ్ సంగమేశ్, న్యాయవాది లక్ష్మణ్‌రావు, అడ్వకేట్ బస్వరాజ్ ఉన్నారు.


దామర చెరువు గ్రామంలో బీఆర్ఎస్ చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## ఓటరు సెల్ఫీ పాయింట్ ప్రారంభించిన కమిషనర్

బొల్లారం, నవంబర్ 7 : క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్య కార్యక్రమంపై ఓటర్లను చైతన్య పరుస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో స్వీప్ అవగాహన కార్యక్రమాన్నిచేపట్టారు. మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఓటర్లను చైతన్య పరుస్తూ ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను కమిషనర్ సంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని ఓటర్లకు ఓటు ప్రాముఖ్యత గురించి వివరిస్తూ ఓటు హక్కును వినియోగించుకోవాలని దివ్యాంగులకు వృద్ధులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీధర్, మెప్మా రిసోర్స్ పర్సన్లు, అంగన్‌వాడీ టీచర్లు ఆశ కార్యకర్తలు దివ్యాంగులు, వృద్ధులు, ఓటర్లు పాల్గొన్నారు.


ఓటర్ సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ సంగారెడ్డి

## ఆర్మీలో చేరే యువకులకు శిక్షణ

మనూరు, నవంబర్ 7: ఆర్మీలో చేరే యువకులకు రెండు నెలల శిక్షణ ఇవ్వడం జరుగుతుందని భవిష్య భారత్ ఎస్‌బీఐ ఫౌండేషన్ మనూరు మండల కో-ఆర్డీనేటర్ జహంగీర్ అన్నారు. మండలంలోని ఉసిరికెపల్లిలో ఎస్‌బీఐ ఫౌండేషన్ భవిష్య భారత్ ఆధ్వర్యంలో ఆర్మీలో చేరే యువకులకు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు ఎస్‌బీఐ ఫౌండేషన్ మేనేజర్‌కు సంప్రదించాలని అన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమే

రాయికోడ్, నవంబర్ 7: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజమేనని ఇందూర్, నల్లంపల్లి పీఏసీఎస్‌ల చైర్మన్లు హనుమంతు, నాగ్‌శెట్టిపాటిల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రాయికోడ్ డీసీసీబీ బ్యాంక్‌మేనేజర్ ధనుంజయ కులకర్ణి బదిలీపై న్యాల్‌కల్ డీసీసీబీ బ్యాంక్‌కు బదిలిపై పోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీ సహజమని, వారు చేసిన సేవలే ప్రజలకు గుర్తు ఉంటాయన్నారు. ఈ సమవేశంలో రాయికోడ్ డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ మమత, సిబ్బంది రాములు, పుణ్యలక్ష్మి, వినీత, మొహ్మద్‌జాని, విజయ్ కుమార్ ఉన్నారు.


ధనుంజయ కులికర్ణిని సన్మానిస్తున్న డీసీసీబీ బ్యాంక్ మేనేజర్